


ఎల్బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి మద్దతుగా కర్మన్‌ఘాట్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. సమావేశానికి హాజరైన జనం

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్/నాగోలు: బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. కొత్తపేట గ్రామం ప్రజానివాస్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలంతా డబుల్ ఇంజిన్ సర్కార్ కోసం ఎదురుచూస్తున్నారని, తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమని అన్నారు. ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారని, ఎల్‌బీనగర్‌లో కాషాయ జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందికొండ గీతా రెడ్డి, మంచి రాజేష్, సుందర్‌నారాయణ, అశ్విన్ సింగ్, సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

- బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆదివారం డివిజన్‌లోని విజయపురి ఫేజ్-1, ఫేజ్-2 కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కొత్తపేట డివిజన్‌లో...

నాగోలు: బడుగు, బలహీన వర్గాల కోసం ఆలోచించేది కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఆపార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కొత్తపేట డివిజన్‌లో కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి మోహన్‌నగర్, ప్రజానివాస్‌లో పాదయాత్ర చేస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు గ్యారంటీ : మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతోందని, మీకు సేవ చేసే అవకాశం తనకు కల్పించాలని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాగోల్ డివిజన్‌లో సర్వే నెం.58, ఫతుల్లాగూడల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. మధుయాష్కీ మాట్లాడుతూ, రాబోయే ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా అత్యధిక నిధులు తీసుకువచ్చి ఎల్‌బీనగర్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

వనస్థలిపురంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వ హించిన బ్రాహ్మణ బాంధవుల కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పూనుకుంటామన్నారు.



హస్తినాపురం భూపేశ్‌గుప్తానగర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మధుయాష్కీ గౌడ్

హస్తినాపురం డివిజన్‌లో...

భూపేశ్‌గుప్తానగర్‌లో 200 మంది మధుయాష్కీ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కొత్తపేటలో సుచి యాష్కీ ప్రచారం..

కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ సతీమణి సుచి యాష్కీ ఆదివారం కొత్తపేట మారుతీనగర్‌లో ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేసి మధుయాష్కీ గౌడ్‌ను గెలిపించాలని కోరారు.

మధుయాష్కీని గెలిపించాలి: మండవ

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ మహిళా అధ్యక్షురాలు స్వర్ణమాధవి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్‌లోని అనన్య రిసార్ట్స్‌లో కమ్మ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. మధుయాష్కీ గౌడ్‌తో పాటు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు హాజరయ్యారు. మధుయాష్కీ కీలకపాత్ర పోషించారని, హస్తం గుర్తుకు ఓటేసి ఆయనను గెలిపించాలని మండవ కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం

మహేశ్వరం అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నది ఒక్క బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రమేనని, అందుకే అన్ని వర్గాల మద్దతు పొందగలిగామని విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆమె ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ, ఆర్‌కేపురం డివిజన్‌లో దాదాపు 800 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని, కారు గుర్తుపై ఓటు వేసిన తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సబితారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మహేశ్వరం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్డు షోలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరంలో కమల వికాసం తథ్యం

బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: బీసీ బిడ్డనైన తనకు ఓటు వేసి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని మహేశ్వరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఆదివారం సిరిగిరిపురం, గంగారం, గంగారం తండా, ఉప్పుగడ్డ తండా తదితర తండాలతో పాటు మోహబ్బత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో మహేశ్వరంలో ఆరు నూరైన కమలం వికసిస్తుందన్నారు.ఇద్దరు స్థానికేతరులు స్థానికుడినైన తనపై పోటీ చేస్తున్నారన్నారు.బీసీ బిడ్డనైన తనకు ఓటు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. మహేశ్వరం మండలంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకు ఇవ్వకుండా పాతబస్తీకి చెందిన ఎంఐఎం కార్యకర్తలకు మంత్రి సబితా రెడ్డి ఇచ్చారని, ఈ ఎన్నికల్లో ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలని స్థానికులను కోరారు. నాయకులు బస్వ పాపయ్య గౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



గంగారంలో శ్రీరాములు యాదవ్‌కు గొర్రె పిల్లను బహూకరిస్తున్న యాదవులు

అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించండి : దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో వేలాది కోట్లతో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో మరోసారి గెలిపించాలని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ, సాయినగర్, భాగ్యలత వంటి కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...ఎల్‌బీనగర్‌ను ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించామని, డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. నిత్యం కాలనీవాసులతో మమేకమై ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించే తనను మరోసారి ఆశీర్వదిస్తే ఐదేళ్ల పాటు సేవకుడిగా ఉండి ఎల్‌బీనగర్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆదమరచి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటు వేస్తే అభివృద్ధి ఆగిపోయి ఇక్కట్లు పడాల్సి వస్తుందని ఆయన అన్నారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, నాయకులు భాస్కర్‌సాగర్, మల్లేష్, గుత్తా లక్ష్మణ్ రెడ్డి, శ్రావణ్, అంజలిగౌడ్ తదితరలు పాల్గొన్నారు.



భాగ్యలత కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి

చంపాపేటలో....

చంపాపేట డివిజన్‌లోని కటకోనికుంట, నెహ్రూనగర్, అంబేద్కర్ వాడ కాలనీలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, పార్టీ నాయకులు నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుపై ఓటు వేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు అశోక్, సురేందర్ రెడ్డి, ఖాదర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్లార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి: దేప



ఆర్‌కే పురంలో కేఎల్లార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న కేఎల్లార్ కోడలు అంజనీరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హర్షలత

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శాసనసభ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) భారీ మెజారిటీతో గెలిపించాలని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని రామకృష్ణాపురం, సరూర్‌నగర్ డివిజన్లలో కేఎల్లార్‌కు మద్దతుగా గడపగడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుపై ఓటు వేసి కేఎల్లార్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్నా గణేష్ నేత, బోని శంకర్, బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర పాల్గొన్నారు.

వాసవి కాలనీలో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి మద్దతుగా ఆయన కోడలు అంజనీరెడ్డి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ సీనియర్ మహిళా నాయకురాలు తమలపాకుల హర్షలత పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే బీసీ ముఖ్యమంత్రి ఖాయం: ఎర్ర సత్యం

చైతన్యపురి: తెలంగాణ రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి కావాలంటే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌ను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యం అన్నారు. చైతన్యపురిలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కుల గణన, మహిళా, బీసీ బిల్లు ప్రధాన అంశంగా బడ్జెట్ ప్రస్తావిస్తూ సానుకూలంగా ఉన్నందున కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించామని ఎర్ర సత్యం తెలిపారు. సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి సాధన సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కన్వీనర్ నాగుల శ్రీనివాస్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నందగోపాల్, బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల రామకృష్ణ,పలు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుస్థిర పాలన కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తారు

– యాకుత్‌పురా అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: సుస్థిర పాలన కోసం యాకుత్‌పురా వాసులు బీఆర్‌ఎస్‌ను గెలిపించడం ఖాయమని సామ సుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీ, కృష్ణానగర్, శ్రీనివాసనగర్, ఇంద్రప్రస్థ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

– బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేట ప్రజలను తనను ఆదరించి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సైదాబాద్ డివిజన్‌లోని జయానగర్, సైదాబాద్ కాలనీ ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తా

– మలక్‌పేట ఎంఐఎం అభ్యర్థి బలాల

మలక్‌పేట: ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తానని ఎంఐఎం పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని దయానంద్ నగర్, ఖాదీబండార్, మొఘల్‌మార్ట్, తాజ్ రెసిడెన్సీ, ఆనంద్‌నగర్‌లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈనెల 30న పతంగి గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మలక్‌పేటలో కాంగ్రెస్‌దే గెలుపు

– అభ్యర్థి షేక్ అక్బర్

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని అభ్యర్థి షేక్ అక్బర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్ డివిజన్ పరిధిలోని సాయిరాం కాలనీ, ఎల్ఐసీ కాలనీ, మాధవ నగర్, కరణ్‌బాగ్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.